జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## నల్గొండ

సూర్యపేట - యాదాద్రి భువనగిరి

శనివారం 22 ఆగస్టు 2026 పేజీలు:12




### కేతేపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్

**దేవరకొండ, ఆగస్టు 21, (ప్రజా జ్యోతి) :**

నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం, కేతేపల్లి గ్రామంలో సి ఆర్ ఆర్-ఎస్ సి పి నిధులు రూ.10 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

వివరాలు 2లో

# పారదర్శకమైన సేవలందించడమే పోలీసుల కర్తవ్యం

- చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ
- రికార్డులు, సీసీటీఎన్ఎస్ పనితీరు పరిశీలన
- సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్




**చౌటుప్పల్, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):**

పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపి న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ స్పష్టం చేశారు. శుక్రవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి సమగ్ర తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లోని జనరల్ డైరీ (జీడీ) ఎంట్రీలు, సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ పనితీరు, కేసు డైరీలు మరియు ఇతర చట్టబద్ధమైన రిజిస్టర్లను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు క్రమబద్ధంగా, డిజిటల్ రూపంలో అప్‌డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సరైన రికార్డుల నిర్వహణే పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్‌కు నిదర్శనమన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో పోలీసులు ఓర్పుతో, గౌరవంగా మాట్లాడాలని సూచించారు. ప్రజల సమస్యలను సానుభూతితో ఆలకించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నిబద్ధతతో విధులు నిర్వర్తించి ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచాలన్నారు నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే నేరాలను ముందుగానే అరికట్టడమే ఆధునిక పోలీసింగ్‌లో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం సరికొత్త పద్ధతుల్లో జరుగుతున్న సైబర్ మోసాలు, ఇతర నేరాలపై సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మథ కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులు హంతకులు కావడం సమాజానికే ముప్పు రూపా రెడ్డి హత్యపై ఎస్ఎఫ్ఐ

## తీవ్ర దిగ్భ్రాంతి, దేవరకొండలో ఘనంగా క్యాండిల్ ర్యాలీ

02



# విద్యార్థులు హంతకులు కావడం సమాజానికే ముప్పు రూపా రెడ్డి హత్యపై ఎస్ఎఫ్ఐ

## తీవ్ర దిగ్భ్రాంతి, దేవరకొండలో ఘనంగా క్యాండిల్ ర్యాలీ

మొదటిపేజీ తరువాయి

**దేవరకొండ, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి) :**

కొండమల్లేపల్లి నాగార్జున ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్య అత్యంత విషాదకరమని, విద్యాబుద్ధులు నేర్పే గురువులను విద్యార్థులే హంతకులై చంపడం సమాజంలో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తగా క్యాండిల్ ర్యాలీ పిలుపులో భాగంగా దేవరకొండ పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూపా రెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు మాట్లాడుతూ.. సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన విద్యార్థి లోకం, క్షణికావేశంలోనూ, దురాశతోనూ నేరాల వైపు మళ్లడం నైతిక పతనానికి నిదర్శనమన్నారు. చదువుతో పాటు నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉందన్నారు.మృతురాలు రూపా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం తరపున తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘోరాలు పునరావృతం కాకుండా విద్యాసంస్థల్లో తగిన కౌన్సెలింగ్ విధానాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.ఎస్ఎఫ్ఐ జిల్లా నియోజకవర్గ కమిటీ

---

# కేతేపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్

మొదటిపేజీ తరువాయి

గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు, రైతుల పంట పొలాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు అవసరమైన అన్ని రోడ్డు సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ చర్యలు తీసుకుంటామని, గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. గిరిజన తండాలు, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతూ, ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మండల అధ్యక్షుడు వాంకుడావత్ బిక్కు నాయక్, జిల్లా కార్యదర్శి లోకసాని కృష్ణయ్య, స్థానిక సర్పంచ్ కేతావత్ పద్మ-భీమ్ సింగ్ నాయక్, కోతి యుగేందర్ రెడ్డి, వాంకుడావత్ పాపా నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పులికంటి సుధాకర్, బైరెడ్డి కొండల్ రెడ్డి, గిరి యాదయ్య, గడ్డం వెంకటయ్య, మండలానికి చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, కొప్పుల సురేందర్ రెడ్డి, కేతావత్ హేమ్లా నాయక్, నీలం ఆంజనేయులు, ఎలుక జాలాంధర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తపల్లి రాములు, కేతావత్ శంకర్, వార్డు మెంబర్లు స్వామి నాయక్, వడ్త్య రాము, పల్స రమేష్, జరుపుల భాష, కొత్తపల్లి వెంకటయ్య, గ్యమా, మధు నాయక్, గ్రామస్థులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా దాసరి మంజుల



**తుంగతుర్తి, ఆగస్టు 21,(ప్రజా జ్యోతి):**

బిజెపి పార్టీ మహిళా మోర్చా సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షురాలీగా మండల పరిధిలోని వెంపటి గ్రామ ఉప సర్పంచ్ దాసరి మంజుల రామచంద్రు ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నాళ్లుగా బీజేపీలో కొనసాగుతూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న మంజులకు జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా అవకాశం కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి,నియోజకవర్గ ఇన్చార్జి కడియం రామచంద్రయ్య, స్థానిక బీజేపీ నేతలు తనపై పెట్టిన నమ్మకానికి తగినట్టుగా పార్టీకి సేవలందిస్తానని ఈ సందర్భంగా మంజుల పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచర్ల నర్సిరెడ్డి, నాయకులు గుండ్ల సత్యనారాయణ, గుండగాని అంజయ్య, అబ్బగాని ఎల్లయ్య, గుండ గాని మల్లయ్య, పోన్నం రాములు తదితరులు మంజులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కుందేలు తిరుమలగిరిలో భూముల రీ -సర్వే గ్రామసభ

**నాంపల్లి, ఆగస్టు, 21(ప్రజా జ్యోతి):**

నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు నాంపల్లి మండలం శుక్రవారం కుందేలు తిరుమలగిరి గ్రామంలో చండూరు ఆర్డిఓ శ్రీదేవి ఆధ్వర్యంలో భూ రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సర్వేలో గ్రామాలను రీ సర్వే, సరిహద్దుల నిర్ణయం, రికార్డుల నవీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. భూ వివాదాలను అధికారుల దృష్టికి తెస్తే రీ సర్వే చేపడతామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆంజనేయులు , ఉప సర్పంచ్,ఆర్ ఐ, ల్యాండ్ సర్వేయర్లు , జిపిఓ లు,రెవెన్యూ సిబ్బంది, రైతులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ...

## - పాఠశాలలు టీచర్లకు భద్రత కల్పించాలంటూ..!

## - ట్రస్మా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

## - ఎమ్మెల్యే, అధికారులకు వినతిపత్రాల అందజేత

**మిర్యాలగూడ, ఆగస్టు 21, ప్రజాజ్యోతి):**

ఇటీవల విద్యార్థుల చేతిలో దారుణ హత్యకు గురైన నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపా రెడ్డి హత్య ను ఖండిస్తూ, ప్రైవేట్ పాఠశాలల యాజ మాన్యాల, ఉపాధ్యాయుల భద్రత, గౌరవం, విద్యా వాతావరణ పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మిర్యాలగూడలోని తెలంగాణ రేకగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో పాఠశాలలు మూసివేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రూప రెడ్డి మృతిని తీవ్రంగా ఖండిస్తూ, మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న పాఠశాల యాజమాన్యాలు మరియు ఉపాధ్యాయులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామన్నారు . ఈ నేపథ్యంలో తాము సూచించే పలు అంశాలపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.ఉపాధ్యాయుల స్వేచ్ఛ, భద్రతకు చట్టపరమైన రక్షణ,విద్యా హక్కు చట్టం మరియు సంబంధిత విద్యా చట్టాల పరిధిలో ఉపాధ్యాయులు తమ విధులను స్వేచ్ఛగా, భయరహిత వాతావరణంలో నిర్వహించేలా తగిన రక్షణాత్మక నిబంధనలు మరియు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు మరియుఉపాధ్యాయులపై తరచుగా జరుగుతున్న బెదిరింపులు, దాడులు, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని,విద్యార్థుల క్రమశిక్షణ, ప్రవర్తన, భవిష్యత్తు పట్ల తల్లిదండ్రుల బాధ్యతను పెంచే విధంగా ప్రభుత్వం, ప్రజా సంఘాలు మరియు విద్యా సంస్థలు కలిసి అవగాహనకార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.యువతను మత్తు పదార్థాల బారిన పడకుండాకాపాడేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ విక్రయాలు, సరఫరా మరియు వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు.పాఠశాలలకు చుట్టుపక్కల ఉన్న షాపులు, ఇతర వాణిజ్య కేంద్రాల్లో తరచుగా తనిఖీలు నిర్వహించి, విద్యార్థు లకు మత్తు పదార్థాలు, నిషేధిత వస్తువులు విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాల న్నారు.విద్యార్థినులు, మహిళాఉపాధ్యాయుల భద్రత కోసం షీ టీం సభ్యుల సంఖ్యను పెంచి, వారి పనితీరును మరింత మెరుగుపర చాలన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలఉపాధ్యాయులకు చట్టపరమైన అంశాలు, సైబర్ భద్రత, డ్రగ్స్ నివారణ, విద్యార్థుల ప్రవర్తన, మహిళా భద్రత తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను గుర్తిస్తూ,ఉపాధ్యాయుల గౌరవం మరియు ప్రతిష్టను పెంచే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అసాంఘిక శక్తులు, సంఘవ్యతిరేక వ్యక్తులు లేదా ఇతరుల నుంచి పాఠశాలయాజమాన్యాలు మరియు ఉపాధ్యాయులకు ఎలాంటి బెదిరింపులు, దాడులు జరగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాలయాజమాన్యాలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి త్వరగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక నోడల్ అధికారి/హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, అత్యవసర ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రూపారెడ్డి దారుణ హత్య




వంటి ఘటనలు పునరావృతం కాకుండా, భవిష్యత్తులో ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయిని మరియు పాఠశాల యాజమాన్యం భయరహితంగా, గౌరవప్రదంగా తమ విధులను నిర్వహించే వాతావరణం కల్పించాలని కోరుతున్నామన్నారు. అనంతరం తమ వినతులను పరిశీ లించాలంటూ స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), ఆర్డీవో రమణారెడ్డి, డి.ఎస్.పి రవి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ,శ్రీరామ కవచం నాగరాజు,వంగాల నిరంజన్ రెడ్డి ,మారుతి అమరేందర్ రెడ్డి,అలుగువెల్లి శ్రీనివాస్ రెడ్డి, కుందూరు శ్యాంసుందర్ రెడ్డి, కే కే జయరాజన్, అయ్యన్న, శ్రీపతి శ్రీనివాస్ ,సాయి శ్రీనివాస్, మహమ్మద్, మల్లు రవీందర్ రెడ్డి, కందాల శ్రీనివాసాచారి, బొడ్డుపల్లి వరప్రసాద్, నీలిమ,చంద్రకళ,అనిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు..

## "ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి"



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**
వరలక్ష్మీ వ్రతం సందర్భంగా భూదాన్ పోచంపల్లి మండలవ్యాప్తంగా శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో లక్ష్మీనారాయణ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీ మార్కండేయ స్వామి దేవాలయంలో శ్రీ శంకర మహిళా భజన మండలి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మండలంలోని వివిధ గ్రామాలు, ఆలయాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని అలంకరించి మంగళహారతులు సమర్పించారు. మహిళలు భజనలు, మంగళగీతాలతో ఆలయాలను ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు.సుమంగళీ సౌభాగ్యం, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని వరలక్ష్మీదేవిని ప్రార్థిస్తూ మహిళలు వ్రతాలు ఆచరించారు. దీంతో మండలవ్యాప్తంగా ఆలయాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.



## కె ఎన్ ఎం డిసి లో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

### - ప్రిన్సిపల్ భీమార్జునారెడ్డి

**మిర్యాలగూడ, ఆగస్టు21,(ప్రజా జ్యోతి):**



మిర్యాలగూడ పట్టణం లోని కె.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. భీమార్జున రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో కామర్స్ సబ్జక్ట్ లో (బి.ఎఫ్.ఎస్.ఐ.) 01, తెలుగు సబ్జక్ట్ లో 01 ఖాళీలు ఉన్నాయని, సంబంధిత సబ్జక్ట్ పి. జి. లో 55 శాతంతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పి. హెచ్ డి, నెట్,సెట్,బోధనానుభవం కలిగిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.అభ్యర్థులు ఈ నెల 24 వ తేదీ లోపు దరఖాస్తు లను కళాశాల కార్యాలయంలో నేరుగా సమర్పించాలని తెలిపారు. ఈ నియామకాలు కమీషనర్, కళాశాల విద్య వారు జారీ చేసిన ఉత్తర్వులకు లోబడి ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

## పచ్చదనంతో మానసిక ప్రశాంతత

## ఆస్పత్రి సూపరిండెంట్ డా.వెంకటేశ్వర్లు

**రామన్నపేట, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి)**



పచ్చదనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆయన వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మొక్కలు కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయి. దీంతో దుమ్ము, కాలుష్యం తగ్గుతుంది. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రశాంతమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి అందించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించాల్సిన బాధ్యత మనపై ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. సిబ్బంది కూడా తమ బాధ్యతగా నాటిన ప్రతి మొక్కను పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డా. సదాఫ్ ఫాతిమా, డా. లావణ్య, డా. జైనబ్ సుల్తానా, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల ఆనంద్, హెడ్ నర్స్ సోలి, సిబ్బంది సాయి తేజ, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**తుంగతుర్తి ఆగస్టు 21, (ప్రజా జ్యోతి):**
ఈ నెల 24న తుంగతుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చలపతి తెలిపారు.శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశం ఈ సమావేశం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచులు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పించాలి...!

## - గిరిజన విద్యార్థి సంఘం నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

**మిర్యాలగూడ, ఆగస్టు 21 ,( ప్రజాజ్యోతి ):**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పించాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు అన్నారు. గిరిజన విద్యార్థి సంఘం, ఎల్ హెచ్ పి ఎస్ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు గారు హాజరై సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి ,ఎస్సి ,ఎస్టీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సి , ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. బిసి ,ఎస్సి ,ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోవిద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు. విద్యార్థి సంఘాలు చేపడుతున్న న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు ఇంధల్ రాథోడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి బాలాజీ నాయక్, రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ కోటియా నాయక్, ఉపాధ్యక్షుడు లావూరి రవీందర్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైదా నాయక్, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెరక, కొండారం గ్రామంలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

**శాలిగౌరారం మండలం, ఆగస్టు 21: ప్రజా జ్యోతి**



నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం పెరక, కొండారం గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుద్దాల వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సర్పంచ్ నూక నాగలక్ష్మిజానయ్య దంపతుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అమ్మవారికి అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు చేసి, వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. పూజా కార్యక్రమాల సందర్భంగా ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమతో పాటు వాయనాలు అందజేశారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.



# ప్రిన్సిపల్ రూప రెడ్డికి ఘన నివాళులు

## - నిందితులను కఠినంగా శిక్షించాలి.

## - బిస్మార్ట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్ రెడ్డి డిమాండ్

**భువనగిరి,ఆగష్టు 21 (ప్రజాజ్యోతి)**

బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తెలంగాణ,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ ఐఐటి ప్రాంగణంలో,ఇటీవల దుర్మార్గుల చేతిలో హత్యకు గురైన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ రూపా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిన్సిపల్ రూపా రెడ్డిని అతి దారుణంగా హత్య చేయడంను నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకోనేలా ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడంతో ఉపాధ్యాయులు భయానికి లోనవుతున్నారు. అందువలన ఉపాధ్యాయులకు రక్షణ కల్పించేలా ప్రత్యేకమైన,చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి స్మార్ట్ యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరెడ్డి,కోశాధికారి ప్రభాకర్ రెడ్డి,రవి కుమార్,మల్లేశం గౌడ్,రమేష్, శ్రీనివాస్ రావు శ్రీనివాస్,జార్జ్,జోసెఫ్,విద్యా సాగర్, అరుణకుమారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దు

## - మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు - అల్లే పరమేష్

**నార్కట్ పల్లి, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):**



పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దని మల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ అన్నాడు. శుక్రవారం రోజున జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... పాలిటెక్నిక్ కోర్సు కు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 97 ద్వారా డిప్లమా కోర్సులను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఐటిఐ ఏటీసీ లతో అనుసంధానం చేయాలని నిర్ణయం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే అని విమర్శించాడు. పాలిటెక్నిక్ అనేది ఒక ప్రత్యేకమైన సాంకేతిక విద్యావ్యవస్థ అని దీని ప్రమాణాలు పెంపొందించాల్సింది పోయి ఇతర ప్రాథమిక శిక్షణ కోర్సులతో అనుసంధానం చేసి దాని ప్రాధాన్యత తగ్గించడం చాలా దుర్మార్గమైన నిర్ణయం అని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానం చేసే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఘనంగా శ్రావణ మాసపు వరలక్ష్మి వ్రతాలు

## - భక్తులతో కిటికిట లాడిన ఆలయాలు

**మిర్యాలగూడ, ఆగస్టు 21,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా పవిత్ర శ్రావణ మాసపు మొదటి శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జామున మహిళలు అభ్యంగన స్నానాలు ఆచరించి, ఇంటిలోనే మంట పాలు ఏర్పాటు చేసుకుని కొందరు, మరికొందరు దేవాలయాలకు చేరుకొని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నోములు అనంతరం వాయనాలు అందజేశారు. తమ కుటుంబంతో పాటు పల్లెలంతా సుభిక్షంగా విరాజిల్లాలని కోరుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, కనకదుర్గమ్మ దేవాలయాలు మహిళ భక్త జనాలతో కిక్కిరిసిపోయాయి.





# వయ్యారి భామను వదిలేద్దాం.. పంటలను కాపాడుకుందాం

**గరిడేపల్లి,ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):**

వయ్యారి భామ (పార్థీనియం/కాంగ్రెస్ గడ్డి)ను పూతకు రాకముందే వేర్లతో సహా తొలగించాలని చైతన్య డీమ్డ్ టు బీ వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు రైతులకు సూచించారు. గరిడేపల్లిలో వయ్యారి భామ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వయ్యారి భామ వల్ల పంటల పెరుగుదలకు ఆటం కం కలగడంతో పాటు మనుషులు పశువుల ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని తెలిపారు. మొక్కలను తొలగించే సమయంలో గ్లౌజులు ధరించాలని,తొలగించిన మొక్కలను సక్రమంగా నాశనం చేయాలని సూచించారు.పొలం గట్లు, రహదారి పక్కలు,ఖాళీ ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు.హెర్బిసైడ్ల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని,వ్యవసాయ అధికారుల సూచనలు,మందుల లేబుల్‌పై పేర్కొన్న మోతాదులను తప్పనిసరిగా పాటించాలని సూచించా రు.గ్రామస్థాయిలో సామూహికంగా కలుపు నిర్మూలన చేపడితే వయ్యారి భామని సమర్థంగా అరికట్టవచ్చన్నా రు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు గీతాంజలి,లహరి,శరణ్య, వినీల,అభివర్ష రెడ్డి,షిజా తదితరులు పాల్గొని రైతులకు నివారణ పద్ధతులను వివరించారు.





# వివాహేతర సంబంధాల మోజు.. "ఛిద్రమవుతున్న కుటుంబాలు"

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి)**

సమాజంలో కుటుంబ వ్యవస్థకు వివాహం ఒక బలమైన పునాది. భార్యాభర్తల మధ్య నమ్మకం, ప్రేమ, పరస్పర గౌరవం దాంపత్య జీవితాన్ని సంతోషంగా నిలబెడతాయి. అయితే ఇటీవలి కాలంలో వివాహేతర సంబంధాలు అనేక కుటుంబాల్లో కలహాలకు, విడాకులకు, హింసాత్మక ఘటనలకు దారితీస్తున్నాయని గమనించవచ్చు.దాంపత్య జీవితంలో పరస్పర అవగాహన లోపించడం, అనుమానాలు, నిర్లక్ష్యం, కుటుంబ సభ్యులతో సరైన సంభాషణ లేకపోవడం, సామాజిక మాధ్యమాల ద్వారా ఏర్పడే పరిచయాలు వంటి అంశాలు కొన్నిసార్లు వివాహేతర సంబంధాలకు దారితీస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలను పరిష్కరించాల్సిన బదులు రహస్య సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వడం కుటుంబ బంధాలను బలహీనపరుస్తోంది.వివాహేతర సంబంధాల నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో హత్యలు, ఆత్మహత్యలు, దాడులు, విడాకులు వంటి ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. కొన్నిచోట్ల జీవిత భాగస్వామిని హత్య చేయించడం, ఆత్మహత్యకు ప్రేరేపించడం, పిల్లలను నిర్లక్ష్యం చేయడం వంటి తీవ్రమైన సంఘటనలు కూడా నమోదవుతున్నాయి. ఇలాంటి ఘటనల వల్ల కుటుంబ సభ్యులతో పాటు చిన్నారులు కూడా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.మానసిక నిపుణులు, సామాజిక వేత్తల అభిప్రాయం ప్రకారం దాంపత్య జీవితంలో సమస్యలు రావడం సహజమే. అయితే వాటిని పరస్పరం మాట్లాడుకోవడం, పెద్దల సలహా తీసుకోవడం లేదా అవసరమైతే కుటుంబ కౌన్సెలింగ్‌ను ఆశ్రయించడం ద్వారా పరిష్కరించుకోవచ్చు. క్షణిక ఆకర్షణ కోసం తీసుకునే నిర్ణయాలు జీవితాంతం బాధను మిగల్చే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.కుటుంబ బంధాలను కాపాడుకోవాలంటే పరస్పర నమ్మకం, నిజాయితీ, సహనం, గౌరవం వంటి విలువలను పాటించడం అవసరం. కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఒకరి భావాలను మరొకరు అర్థం చేసుకోవడం, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థను నిర్మించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



# పారదర్శకంగా రీ-సర్వే ప్రక్రియ చేపట్టాలి

## - గడువులోగా పూర్తి చేయాలి - ఆర్డీఓ రమణా రెడ్డి

**హాలియా,ఆగస్టు21(ప్రజా జ్యోతి)**

రైతుల భూములకు సంబంధించిన రీ సర్వే పారదర్శకంగా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం అనుముల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా కార్యాలయంలోని రీ-సర్వే రిజిస్టర్‌ను సంబంధిత రికార్డులను అత్యంత సమగ్రంగా పరిశీలించారు.రైతుల భూములకు సంబంధించిన రీ-సర్వే ప్రక్రియ వేగవంతంగా,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా రీ-సర్వే పనుల పురోగతి సాంకేతిక అంశాలపై తహసీల్దార్ బి. చందర్ రావు కు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు.క్షేత్రస్థాయి పరిశీలనలో ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే పరిష్కరించి,రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పక్కాగా రికార్డులను నమోదు చేయాలని స్పష్టం చేశారు.సర్వే ప్రక్రియలో సిబ్బంది అంకితభావంతో పనిచేసి,నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్వేయర్ పోకల విజయ్ కుమార్,జిపిఓ కోడి రెక్క సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలి

## – రామన్నపేట కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

## – ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి




**రామన్నపేట ఆగస్టు 21 (ప్రజా జ్యోతి)**

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా అనుసరిస్తున్న ఏకపక్ష, అప్రజాస్వామిక, రాజకీయ పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఈూ×ాఖ) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.రామన్నపేట కోర్టు ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూమనన్ కుమార్ మిశ్రా పద్నాలుగు సంవత్సరాలకు పైగా బీసీఐ చైర్మన్‌గా కొనసాగుతూ, చట్టబద్ధమైన ప్రజాస్వామిక సంస్థలో అధికారాన్ని వ్యక్తిగతంగా కేంద్రీకరించడం అభ్యంతరకరమన్నారు. బీసీఐ ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదని, దేశంలోని న్యాయవాదులందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని పేర్కొన్నారు. బీసీఐ అధికారిక పదవిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం సంస్థ స్వతంత్రతను, విశ్వసనీయతను దెబ్బతీస్తుందని విమర్శించారు.నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ పట్టభద్రులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడం ఏకపక్షమైన, చట్టవిరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు శాంతియుతంగా అభిప్రాయం వ్యక్తం చేసినందుకు మొత్తం బ్యాచ్‌ను శిక్షించడం రాజ్యాంగ విలువలకు, న్యాయవాదుల చట్టం1961కు విరుద్ధమన్నారు. ఆదేశాలను అనంతరం ఉపసంహరించుకున్నప్పటికీ, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత నుంచి చైర్మన్ తప్పించుకోలేరన్నారు.ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులను నామినేషన్ల ద్వారా అధికార స్థానాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నించడం ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమన్నారు. న్యాయవిద్య ప్రమాణాలు, న్యాయ కళాశాలల తనిఖీలు, అనుమతులకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.బీసీఐ కోల్పోయిన గౌరవం, విశ్వసనీయత, ప్రజాస్వామిక స్వభావాన్ని పునరుద్ధరించేందుకు మనన్ కుమార్ మిశ్రా వెంటనే చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వంచ జగతయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, గడ్డం నరసింహ, వీరమల్ల నర్సింహ, అంతటి రమేష్, అంకం నరేష్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముప్పారం గ్రామంలో మద్యం అమ్మకాలు నిషేధం...

## - మద్యం అమ్మకాలు జరిపితే..రూ.50వేలు జరిమానా





**నిడమనూరు, ఆగష్టు 20(ప్రజాజ్యోతి):**

మండలంలోని ముప్పారం గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామ పంచాయతీ పాలకవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముప్పారం గ్రామపంచాయతీ పరిధిలో యువత , ప్రజల ఆరోగ్యాల రీత్యా మద్యం అమ్మకాలపై పూర్తిగా నిషేధించాలని పాలకవర్గం తీర్మానించి ఆమోదించారు . సెప్టెంబర్ ఒకటో తారీఖు నుంచి ముప్పారం గ్రామంలో మద్యం విక్రయించిన వారిపై గ్రామ పంచాయితీ పాలకవర్గం రూం. 50వేలు జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్, పోలీసు వారు చట్ట పరమైన చర్యలు తీసుకుంటారు. పాలకవర్గం తీసుకున్న నిర్ణయానికి ముప్పారం బెల్టు షాపుల నిర్వాహకులు, పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ ఒకటో తారీకు తర్వాత మద్యం విక్రయించిన వారిని పట్టిస్తే రూ.5వేలు నజరానా బహుమతి అందజేస్తామని సర్పంచ్ ఆలంపల్లి రోజా కృష్ణ ప్రకటించారు.ఆయన వెంట ఉప సర్పంచ్, వార్డ్ మెంబెర్స్,తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రతం



**చింతలపాలెం, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి) :**

మండల కేంద్రంలో వేంచేసి ఉన్న గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అంకమ్మ తల్లి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలు, వివిధ రంగుల గాజులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని నిర్వహించగా గ్రామానికి చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు అమ్మవార్ల ఆశీర్వాదంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తన్నీరు శివ, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జానకి స్వగృహంలో ఘనంగా శ్రీ వరలక్ష్మీ వ్రతం వేడుకలు

**రామన్నపేట ఆగస్టు 21 ప్రజా జ్యోతి.**

శ్రావణమాసం సందర్భంగా లవణం జానకి ఉపేందర్ స్వగృహంలో శ్రీ వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమం నిర్వహించారు వేద పండితులు ఎం శ్రీనివాస్ చార్యులు శ్రీదేవి వ్రతం పూజ విధానాన్ని వివరించి కుటుంబ సభ్యులకు మరియు బంధుమిత్రులకు ఆశీర్వాదం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేసినారు .







# ఎమ్మార్పీఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

## - జి.ఉపేందర్ మాదిగ

**పెన్ పహాడ్, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** అంబేద్కర్ అభయహస్తం పథకం అమలుకై ఉద్యమిస్తూ సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహించబోయే బహిరంగ సభను ఎస్సీ సమాజం పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడెపూరి ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. పెన్ పహాడ్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ ఆదేశాలు, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ గారి సూచనల మేరకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ముప్పై సంవత్సరాలుగా మాదిగలు అలుపెరుగని పోరాటాలు చేసి, ఎంతోమంది ఆత్మబలిదానాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, ఈ చారిత్రాత్మక విజయాన్ని అమరులైన మాదిగ బిడ్డల కుటుంబాలకే అంకితం ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే అంబేద్కర్ అభయహస్తం స్కీమ్ ద్వారా పన్నెండు లక్షలరూపాయల ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కులవృత్తులపై ఆధారపడిన డప్పు మరువు, చెప్పులు కుట్టే మాదిగ కార్మికులకు నెలకు నాలుగు వెయ్యిల రూపాయల జీవనభృతి పెన్షన్ ఇవ్వాలని, విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తూ దళితులకు విద్యాసంస్థల్లో ఇరవై శాతం సీట్లు కేటాయించాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఎస్సీ విద్యార్థికి పదివేల రూపాయల నగదు సహాయం అందించడంతో పాటు ప్రతిమండల కేంద్రంలో ఒక ప్రభుత్వ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కనుక జానయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, మండల ఉపాధ్యక్షులు జానయ్య, సీనియర్ నాయకులు కత్తి రవీందర్, సర్పంచ్ ఒగ్గు రవి, నాయకులు ఒగ్గు సైదులు, వెంకన్న, సోమయ్య తదితర ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట మీద నిలబడాలి...

# ప్రమాణానికి రావాలి....

## - మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

**చండూరు, ఆగస్టు, 21(ప్రజా జ్యోతి):** ప్రభుత్వ వ్యతిరేకత మీద గత సోమవారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ధర్నా కార్యక్రమంలో చండూరు చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో బస్సు షెల్టర్ మొదట పండ్ల బండ్ల దగ్గర కడతామని చెప్పి తర్వాత మరొకచోట కడుతున్నారని, ఆ పండ్ల బండ్ల షాపు వాళ్లను బెదిరియ్యగానే తల ఒకటి, రెండు చొప్పున మొత్తం 12 లక్షలు అంటుకున్నారని, వీళ్లు వైన్ షాపులు, పండ్ల షాపులు, హాస్పిటల్స్, కాంట్రాక్టర్లను, రియల్ ఎస్టేట్ వాళ్లను ఎవరిని వదిలిపెడతలేరని, అందరి దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని, ఒకవేళ ఇదే అబద్ధం అనుకుంటే గుడి కాడికి పోయి ప్రమాణం చేస్తా అని అన్నారని, దానికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పై వ్యాపారస్తులందరిని తీసుకొని వచ్చి ప్రెస్ మీట్ పెట్టి నేను గానీ, మా పాలకవర్గంగాని ఏ ఒక్కరి దగ్గరైనా ఒక్క రూపాయి లంచం తీసుకున్నానని గాని, అవినీతి చేస్తున్నానని గాని నిరూపిస్తే రాజీనామా చేస్తానని తెలిపారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట ప్రకారం శనివారం శిర్ధపల్లి రోడ్డున గల ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం 09:00 గంటలకు ప్రమాణం చేయడానికి రావాలని తెలిపారు. నేను డబ్బులు తీసుకున్నానని వారు ప్రమాణం చేయాలి, నేను డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తానని, అదే విధంగా మీరు ఎవరి మీద అయితే అభియోగాలు మోపారో అట్టి వ్యాపారస్తులు కూడా కోడి శ్రీనివాసులుకు గాని, కౌన్సిలర్లకుగాని ఒక రూపాయి ఇవ్వలేదని ప్రమాణం చేస్తారని తెలిపారు. మీరు తప్పనిసరిగా మాట మీద నిలబడతారని, ఈ ప్రమాణానికి వస్తారని వేయికళ్లతో ఎదురు చూస్తామని అన్నారు. ఒకవేళ మీరు రాకపోతే మిమ్మల్ని మునుగోడు నియోజకవర్గం ప్రజలు ఎవ్వరు నమ్మరని, మీరు మాట్లాడిన మాటలు వెనుకకు తీసుకొని మాకు క్షమాపణ చెప్పాలని అన్నారు.



# బీజేపీ జెండా దిమ్మె తొలగింపు సరికాదు

**గరిడేపల్లి,ఆగస్టు 21(ప్రజా జ్యోతి):** గరిడేపల్లి మండలం రాయినిగూడెంలో బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ జెండా దిమ్మెను పక్కకు జరిపి,జెండా రాడ్డును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించడం తో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను తొలగించడాన్ని బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి ఖండించారు. శుక్రవారం ఆమె సంఘటనా స్థలాన్ని పరిశీలించి పార్టీ నాయకులు,కార్యకర్తలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై గోపిరెడ్డిని కలిసి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. సీసీ కెమెరా ఫుటేజీ,ఇతర ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలు ఉన్నా ప్రజాస్వామ్య హక్కుల ను హరించే చర్యలను సహించబోమని శ్రీలత రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు ఆకుల బిక్షమ య్య,కుక్కడపు వెంకటేశ్వర్లు,చిత్తలూరు సోమయ్య,జెనెగల శ్రీనివాస్,కాంపాటి రాజు,నర్సింగ్ నాగ సైదులు,మేకపోతు ల వీర ప్రసాద్,కుక్కడపు లక్ష్మయ్య, బంటు అంజి,కోల గోపి,పిడమర్తి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# నేత్రపర్వంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

**హాలియా,ఆగస్టు21(ప్రజా జ్యోతి)** హాలియా పట్టణంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ మాస ద్వితీయ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ దేవి వ్రత మహోత్సవాన్ని అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక శోభతో నిర్వహించారు. ఈ పావన పర్వదినం సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారితో పాటు అమ్మవారికి అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపారు. అనంతరం లోక కళ్యాణార్థం,భక్తుల సుఖసంతోషాలకై మహాలక్ష్మి మూలమంత్ర హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఈ పూజా మహోత్సవంలో హాలియా పట్టణ పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తజనుల గోవింద నామస్మరణలు, అమ్మవారి దివ్య నామావళితో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక ఉత్తేజంతో నిండిపోయింది. ఈ వేడుకల్లో స్థానిక భక్త బృందం,ఆలయ నిర్వాహకులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడి ఆర్థిక చేయూత

**నకిరేకల్: ఆగస్టు 21 ప్రజా జ్యోతి**


నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామానికి చెందిన జక్కల కిష్టయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండగోని నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ 20 కిలోల చికెన్‌ను అందజేశారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. కిష్టయ్య మృతి బాధాకరమని, ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యత అని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రార్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# సామూహిక వరలక్ష్మీ పూజలు శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం

**రామన్నపేట ఆగస్టు 21 (ప్రజా జ్యోతి )**

రామన్నపేట పట్టణ కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం నందు సామూహిక వరలక్ష్మి పూజలను పురస్కరించుకొని ఆలయ పూజారి ఎం శ్రీనివాస్ చర్యలు శ్రీదేవి పూజా కార్యక్రమాన్ని భక్తులచే పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్, కమిటీ సభ్యులు కొత్త మాస మధు, దొంత యాదగిరి, బ్రహ్మచారి, మద్దెగల్ల నరసింహ, మల్లేశ్, కొత్త మాస్ నవీన్ ,భవాని,లవణం జానకి, మామిళ్ళ కవిత, కేతమ్మ, మంజుల,, గోగి కార్ పుణ్యావతి, విజయలక్ష్మి, లవణం సరిత, ఇంద్రమ్మ, సులోచన, కీర్తి, భవిష్య, పవన్ కళ్యాణ్ భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు.





# శాస్త్రీయ పద్ధతులతోనే అధిక దిగుబడులు

**చింతలపాలెం, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి) :**



ప్రస్తుత పంటల దశలో రైతులు అప్రమత్తంగా ఉండి, చీడపీడలు, తెగుళ్ల నివారణకు సకాలంలో తగిన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం హుజూర్‌నగర్‌కు చెందిన శాస్త్రవేత్తలు శుక్రవారం చింతలపాలెం మండలంలోని పలు పంట పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. రైతులు ప్రస్తుతం అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. మిరప పంటలో నేల ద్వారా సంక్రమించే వ్యాధుల నివారణకు ట్రైకోడెర్మా జీవ శిలీంధ్ర నాశినిని సేంద్రియ ఎరువులో కలిపి పొలంలో వేయాలని సూచించారు. కాండం కుళ్లు వ్యాధి ఉన్న ప్రాంతాల్లో లీటరు నీటికి 2 గ్రాముల డైమెథోమార్ఫ్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పత్తి పంటలో దీపపు పురుగుల నివారణకు ఎకరాకు 80 గ్రాముల ఫ్లోనికామిడ్‌ను పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంట పూత దశలో డీఏపీ తో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను అధికంగా వినియోగించకూడదని రైతులకు సూచించారు. పంటలకు అవసరమైన మోతాదులోనే ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతులను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డా. పరిమళ, శాస్త్రవేత్త డా. చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు భవన్, భవాని తదితరులు పాల్గొన్నారు.



# రేపే డెడ్‌లైన్.. లేదంటే చలో పులిచింతల

## - 19 వేల మంది ఆర్టిజన్ ఉద్యోగులతో భారీ ధర్నాకు పిలుపు

## - ఉద్యోగుల ఆరోగ్యంతో చెలగాటం ఆపాలి- రాష్ట్ర జేఏసీ చైర్మన్ సతీష్‌రెడ్డి

**చింతలపాలెం, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి) :**

పులిచింతల జెన్‌కోలో ఆన్‌ఫర్ ఆర్టిజన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తొమ్మిదో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని రాష్ట్ర ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం, జెన్‌కో యాజమాన్యం శనివారం సాయంత్రంలోగా సమస్యను పరిష్కరించకపోతే 'చలో పులిచింతల'కు పిలుపునిచ్చి భారీ ధర్నా నిర్వహిస్తామని రాష్ట్ర ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ సతీష్‌రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్లుగా జెన్‌కోకు సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఆర్టిజన్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఉద్యోగులు తొమ్మిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఆవేదనకరమన్నారు. దీక్ష చేస్తున్న కార్మికుల ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వినయ్ తెలిపారు. పరీక్షల్లో వారి బీపీ, షుగర్ స్థాయిలు తగ్గినట్లు గుర్తించామని చెప్పారు. దీక్ష కొనసాగుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్టిజన్ జేఏసీ నాయకులు పులిచింతల జెన్‌కో ఎస్ఈ దేశ్యానాయక్‌ను కలిసి ఉద్యోగుల సమస్యపై చర్చించారు. అనంతరం స్థానిక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో శనివారం చర్చలు జరిపిన తర్వాత సాయంత్రం తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 19 వేల మంది ఆర్టిజన్ ఉద్యోగులతో పులిచింతలలో భారీ ధర్నా నిర్వహిస్తామని సతీష్‌రెడ్డి ప్రకటించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించేందుకు వివిధ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర ఆర్టిజన్ ఎంప్లాయిస్ కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి, ఎస్పీడీసీఎల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కనకరాజుతో పాటు రాష్ట్ర జేఏసీ నాయకులు పాల్గొని కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్షకు మద్దతు తెలిపారు.

# పల్లెనిద్ర చేసి... సమస్యలు ఆలకించి...!

## - అభివృద్ధి పనులు ప్రారంభించి... సంక్షేమ పథకాలు అందిస్తూ..!!

## - శెట్టిపాలెంలో సందడి చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్







**మిర్యాలగూడ, ఆగస్టు 21,(ప్రజాజ్యోతి):**

నేను కొందరిలో ఆఫీసుకు పరిమితమై.. సంపాదన కూడగట్టుకునే పాలపుడిని కాదు... ఆఫీసులో కూర్చుని పాలన చేసే ప్రజాప్రతినిధిని అంతకంటే కాదు.. గ్రామ గ్రామాన ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని పరిష్కరించే సామాజిక వేత్తనంటూ.. నిరూపించుకుంటున్నాడు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి( బిఎల్ఆర్ ). 'ప్రగతి సింగిడి జనంతో మాట – పల్లెబాట ' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ రెండు రోజులు సందడి చేశారు. గురువారం సాయంత్రమే గ్రామానికి చేరుకున్న ఆయన ప్రజలతో కాంగ్రెస్ నాయకులతో సమావేశమై గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వారిని నేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారితో మమేకమై రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయాన్నే పల్లె జీవన విధానాన్ని ఆస్వాదిస్తూ అధికారులు గ్రామానికి చేరుకున్న తర్వాత మిర్యాలగూడ ఆర్డీవో ఎస్ రమణారెడ్డి, తహసిల్దార్ హేమలతలతో కలిసి నిర్మాణం పూర్తి చేసుకున్న పల్లె దవాఖానా, మహిళా సంఘం భవనం, అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల కు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అటుపై నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ళకు ప్రారంభోత్సవం చేసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయటం, చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం మరియు విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తూ,ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రయోజనాలను సమర్థవంతంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సులభతరంగా సేవలందించేందుకే స్మార్ట్ కార్డులను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేసి లబ్ధి చేకూర్చాలన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సహకారం చేయటమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యం అన్నారు. ఇందిరమ్మ ఇల్లు పొందిన లబ్ధిదారుల కళ్ళలో ఆనందం వెల్లి విరియడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కరించేందుకు ప్రతి గ్రామంలో పల్లెనిద్ర చేసి తనవంతుగా అభివృద్ధి చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రైలు సౌకర్యాలు కల్పించాలి...!

## - రైల్వే అధికారులను కోరిన ఎంపీ రఘువీర్ రెడ్డి



**మిర్యాలగూడ, ఆగస్టు 21, (ప్రజాజ్యోతి):**

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం, మిర్యాలగూడ రైల్వే ప్రయాణికులకు మరికొన్ని మౌలిక వసతులు, రైలు సౌకర్యాలు కల్పించాలని నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి కోరారు. ఈ నెల 20న, జరిగిన దక్షిణ మధ్య రైల్వే అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ రైల్వే స్టేషన్లో ఇంటర్ సిటీ ఆగేలా చూడాలని గట్టిగా కోరారు. విద్యార్థులు,ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్యులు తమ ప్రయాణం కోసం ఆపాలనికోరుతున్నారని ఆపితే వారికీ మేలు జరుగుతుందని, రైల్వే శాఖకు ఆదాయం సమకూరుతుందని ఆయన అన్నారు. దామరచర్ల రైల్వే స్టేషన్ పునః ప్రారంభించాలని, దీనివలన చుట్టు పక్కల ఉన్న సిమెంట్ పరిశ్రమలు , యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు, వచ్చి పోయే వారికీ మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గుంటూరు–బీబీనగర్ 239 కిలోమీటర్లు డబ్లింగ్, మోటుమర్రి -విష్ణుపురం 99.68కిలో మీటర్లు డబ్లింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని 2028–29 కల్లా పూర్తవుతాయని అధికారులు తెలిపారన్నారు. అమృత్ భారత్ స్కీం కింద మిర్యాలగూడ రైల్వే స్టేషన్ రూ.16.78 కోట్లతో నల్లగొండ రైల్వే స్టేషన్ ను రూ. 17.01కోట్లతో ఆధునీ కరిస్తున్నట్టు తెలిపారు. డోర్నకల్–మిర్యాలగూడ 97. 45కిలోమీటర్ల రైల్వే లైన్ రైల్వే బోర్డు




పరిశీలనలో ఉందని, కాచిగూడ- చిట్యాల- జగ్గయ్యపేట 228 కిలోమీటర్ల మార్గం డిపిఆర్ సిద్ధమవుతున్నదని, డోర్నకల్- గద్వాల్ 308. 28 కిలోమీటర్ల డిపిఆర్ రైల్వే బోర్డుకు సమర్పించినట్టు తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రైల్వే లైన్ ప్రాజెక్ట్ డిపిఆర్ సిద్ధమవుతున్నదని, పరిశీలనలో ఉందని ఆయన తెలిపారు. ఐలపురం, కొండ్రపోల్, దామరచర్ల అండర్ పాస్ బ్రిడ్జిలలో నీరు నిల్వకుండా చేయాలని కోరగా పనులు చేస్తున్నారనిఅధికారులు తెలిపారన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ – నాగార్జునసాగర్ రోడ్డు నుండి మిర్యాలగూడ రైల్వే స్టేషన్ వరకు ప్రయాణికుల, రైల్వే ఉద్యోగుల భద్రతకై విద్యుత్ స్థంబాలపై లైటింగ్ ఏర్పాటు చేయాలని, తమ నియోజకవర్గం ప్రజలకు మెరుగైన రైల్వే రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రైల్వే బోర్డును కోరినట్టు ఆయన తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

## - శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వైభవంగా పూజలు

**చౌటుప్పల్, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి)**



చౌటుప్పల్ భవానీనగర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి వ్రత పూజా క్రతువును జరిపించారు. పురపాలక పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది మహిళలు తరలివచ్చి సంప్రదాయబద్ధంగా పూజల్లో పాల్గొన్నారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సౌభాగ్యం నిండునూరేళ్లు ఉండాలని వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు.ఈ పూజా మహోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్‌గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామి, ధర్మకర్తలు వరకాల రవిగౌడ్, ఆవుల యేసు యాదవ్, గగులోతు అరుణశంకర్ నాయక్, దాడి యశ్వంత్‌రెడ్డి, ట్రినిటీ విద్యాలయాల ప్రిన్సిపల్ ఉజ్జిని మంజుల, పెద్ది స్వాతి కిషోర్‌శర్మ, ఉప్పల కుసుమ, చింతల విజయలక్ష్మి, చింతల కరుణ, ఉప్పల దీపిక, పల్సర్ శ్రావణి, జక్కర్తి స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# బృందావనపురంలో ఫార్మ్ పాండ్ పనులకు శ్రీకారం

## - రైతు కంభంపాటి చైతన్య భూమిలో ప్రారంభించిన అధికారులు

**బృందావనపురం, ఆగస్టు 21, ప్రజాజ్యోతి:**


బృందావనపురం గ్రామంలో వీబీజీ రామ్ జీ పథకం కింద రైతు కంభంపాటి చైతన్య భూమిలో ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కంభంపాటి సరిత చైతన్య, ఎంపీడీవో మాల్సూర్ నాయక్ హాజరై పనులను ప్రారంభించారు.వర్షపు నీటిని నిల్వ చేసుకుని వ్యవసాయ అవసరాలకు వినియోగించుకునేందుకు ఫార్మ్ పాండ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో ఆంజనేయులు, ఏపీవో శ్రీనివాసరావు, టీఏ సతీష్, ఎఫ్ఏ వెంకటేశ్వర్లుతో పాటు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.



# సమర్థ పాలనకు గుర్తింపు.. తహశీల్దార్ వీరబాయికి సత్కారం

**చౌటుప్పల్,ఆగస్టు 21 (ప్రజా జ్యోతి)**

చౌటుప్పల్ మండల ప్రజలకు పారదర్శకమైన సేవలందిస్తూ, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటున్న తహశీల్దార్ వీరబాయిని శుక్రవారం స్థానికంగా ఘనంగా సత్కరించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా స్థాయిలో ఆమె ఉత్తమ అధికారి పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాములు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు తహశీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి శాలువా కప్పి, పూలమాలలతో ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ ఆమె అందిస్తున్న సమర్థవంతమైన పాలనా సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల ప్రధాన కార్యదర్శి మంకాల లింగస్వామి, పంతంగి ఉపసర్పంచ్ బోయ సదానందం, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి, ప్రతినిధులు ప్రశాంతి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగావరలక్ష్మీ వ్రతాలు

**నార్కట్ పల్లి, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలోనిమాంద్ర గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నెలవై ఉన్న శ్రీమహాలక్ష్మీదేవి అమ్మవారికి అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తర పల్లి నరసింహచార్యుల అధ్వర్యంప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఈ కార్య క్రమంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు నూతన పట్టు వస్త్రాలు అష్టోత్తర శతనామావళి పూజ కుంకుమ అర్చనలు వరలక్ష్మీ వ్రత కథ చెప్పిన తరువాత మహిళలు ఆయనాలు ఇచ్చినారు. తరువాత తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు ఈ కార్య క్రమంలో అర్చకులు మూసోజు నవీన్ శర్మ చోల్లేటి పవన్ కుమార్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# నూతన వధూవరులను ఆశీర్వదించిన : కీసర సంతోష్ రెడ్డి

**మోతె ఆగస్టు 21( ప్రజా జ్యోతి ):**

మోతె మండల పరిధిలోని బీక్య తండ గ్రామానికి చెందిన రామకృష్ణ అనిత గారి కుమారుడి వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి. ఆశీర్వదించి ఈ సందర్భంగా నూతన దంపతులకు అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కిసాన్ సేల్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మధు రెడ్డి మధుసూదన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ హలవత్ స్వామి, మాజీ ఎంపీటీసీ భాస్కర్, రాఘవపురం ఎక్స్ రోడ్డు ఉప సర్పంచ్ సుజిత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ' సర్ 'ఓటు మిస్ అయ్యిందా.. ఆందోళన వద్దు...!

## - బి ఎల్ ఓ లను కలిసి సరి చేసుకోండి

**మిర్యాలగూడ,ఆగష్టు 21, (ప్రజాజ్యోతి):**



ఓటర్ జాబితా విస్తృత సవరణ (సర్)లో ఓటర్ గా మిస్ అయిన వారు ఆందోళన చెందవద్దని, బిఎల్ఎ, బి ఎల్ ఓ లని కలిసి సరి చేసుకునే అవకాశం ఉందని మిర్యాలగూడ శాసనసభ నియోజక వర్గంలో మ్యాపింగ్ కానీ ఓటర్లు 5,304 కాగా, కొన్ని తప్పులున్న ఓటర్లు 39,160 ఉన్నారని వాటిని సరి చేసేందుకు బిఎల్ఓలను ఓటర్లు కలవాలని సరి చేసుకోవాలని మిర్యాలగూడ నియోజకవర్గం ఎఇఆర్ఓ, తహసీల్దార్ పి.శ్రీనివాస్ కోరారు. ప్రత్యేక ఓటర్ సవరణ నమోదు (ఎస్ఐఆర్) సర్వే జరిగిన తర్వాత మ్యాపింగ్ కాని ఓటర్లు మిర్యాలగూడ మండలం, పట్టణంలో మాపింగ్ కానివి 3714, చిన్న తప్పులున్న ఓటర్లు 18,772 మంది ఉన్నారని, అడవిదేవులపల్లి మండలంలో మ్యాపింగ్ కానివి, 94, చిన్న తప్పులున్న3402, దామరచర్లలో మ్యాపింగ్ కానివి 608, తప్పులున్నవి 3014, మాడ్గులపల్లిలో మ్యాపింగ్ కానివి 599, తప్పులున్నవి 3079, వేములపల్లిలో మ్యాపింగ్ 289, తప్పులున్నవి 896ఓటర్లున్నారని తెలిపారు. డిఎఓ, మునిసిపల్ కమీషనర్, తహసీల్దార్ లు గ్రామ, వార్డు సభలు నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ కాని వారు, పేర్లు తదితర విషయాలు తప్పులున్న వారు ఆధారాలు సమర్పించి సరి చేసుకోవాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సైదిరెడ్డి ఉన్నారు.

# గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

**నిడమనూరు, ఆగష్టు 20( ప్రజాజ్యోతి);**

నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్య గ్రామ పంచాయతీ పరిధిలోని కోటమైసమ్మ గుడి వద్ద గురువారం గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ా× విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గస్తీ నిర్వహించి జటావత్ వినోద్ ను అదుపులోకి తీసుకున్నట్లు జ× రాఘవరావు తెలిపారు. ఈ సందర్భంగా 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కొండమల్లేపల్లి మండలం రమావతండాకు చెందిన వినోద్ పై గతంలో ద్విచక్రవాహనాలు, ఫోన్ల చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. మరో నిందితుడు మహేష్ పరారీలో ఉన్నాడన్నారు.




# నోముల భగత్ ఇంటా ఘనంగా వరలక్ష్మి వ్రతం

**హాలియా,ఆగస్టు21(ప్రజా జ్యోతి)**

వరలక్ష్మి పురస్కరించుకొని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆయన మాతృమూర్తి నోముల లక్ష్మి సతీమణి హాలియా పట్టణంలో ఆయన అధికారిక నివాసంలో శ్రీ వరలక్ష్మి అమ్మవారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, ఆనందం సుఖ శాంతులు వేల్లి విరియాలని ఆకాంక్షించారు.



# కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నిమ్మనగోటి శ్రీకాంత్

**మోతె ఆగస్టు 21( ప్రజా జ్యోతి):**

మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి సమక్షంలో శుక్రవారం మోతె మండల కేంద్రానికి చెందిన నిమ్మనగోటి శ్రీకాంత్ ను కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోతె మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శ్రీకాంత్ ను పార్టీ కండువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సేల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి, మాజీ జెడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు, సామ చిన్న వెంకటరెడ్డి, బొక్క ఎల్లారెడ్డి, అయిదు బోయిన వెంకన్న, బొడ్డు సాలయ్య, మాజీ అధ్యక్షుడు బొక్క ఉపేందర్ రెడ్డి గురిజాల వెంకన్న,గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రత్నవరంలో ఘనంగా వరలక్ష్మీ పూజలు

## - మాఘమాసం రెండో శుక్రవారం సందర్భంగా

## కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు.



**నడిగూడెం, ఆగస్టు 21,ప్రజా జ్యోతి:**

మాఘమాసం రెండో శుక్రవారం సందర్భంగా రత్నవరం గ్రామంలోని శ్రీ హరిహర క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గాజులు, పుష్పాలతో అంగరంగ వైభవంగా అలంకరించి, లక్ష పుష్పాలతో అర్చన చేశారు. అనంతరం వరలక్ష్మీ పూజతో పాటు కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముఖ్యంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.